# సీఎం కేసీఆర్‌తోనే బీసీలకు న్యాయం

### బీఆర్ఎస్‌లో చేరిన బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు

బన్సీలాల్‌పేట, నవంబర్ 5: జాతీయ బీసీ సంక్షేమ సంఘం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మామిడాల బాలకృష్ణ తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ సనత్‌నగర్ అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదివారం పద్మారావునగర్‌లో వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలోనే బీసీలకు న్యాయం జరుగుతున్నదని, సనత్‌నగర్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నామని బాలకృష్ణ తెలిపారు. నిత్యం ప్రజల మధ్యన ఉండే మంత్రి తలసాని పనితీరు బాగున్నదని, ఆయనను అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామని తెలిపారు. బీసీ సంఘం నాయకులు సంపత్‌కుమార్, సుమన్ యాదవ్, రాకేశ్, సతీశ్, శ్రావణ్, రమేశ్, సుశీల్, శశాంక్, ఉదయ్, ప్రదీప్, అల్బర్ట్ తదితరులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా రజక సంఘం అధ్యక్షుడు సంగుస్వామి, బీఆర్ఎస్ సికింద్రాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్ యాదవ్, మహేశ్ యాదవ్, పద్మారావునగర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి జి.పవన్‌కుమార్ గౌడ్, డివిజన్ అధ్యక్షుడు వెంకటేశన్ రాజు, కార్యదర్శి ఎం.మహేందర్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మంత్రి తలసాని సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, అనుచరులు



### మంత్రి కేటీఆర్‌కు ఆత్మీయ కానుక

తెలంగాణ హైకోర్టు న్యాయవాది, రంగారెడ్డి జిల్లా (విశ్వకర్మ)కు చెందిన రఘు లెంకలపల్లి చేయి తిరిగిన ఆర్టిస్టు. సీఎం కేసీఆర్ అన్నా.. మంత్రి కేటీఆర్ అన్నా.. చెప్పలేని అభిమానం. తాను స్వయంగా గీసిన సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాన్ని తెలంగాణ భవన్‌లో మంత్రి కేటీఆర్‌ను కలిసి అందజేశారు. చిత్రకారుడు రఘును ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ అభినందించారు.

## కారెక్కిన కటికె సత్తి

### డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిక



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కటికె సత్తికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్

సికింద్రాబాద్, నవంబర్ 5: బీఆర్ఎస్ పార్టీ ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేసిందని, పథకాలకు ఆకర్షితులై అనేక మంది పార్టీలో చేరుతున్నారని డిప్యూటీ స్పీకర్, సికింద్రాబాద్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి తీగుల్ల పద్మారావుగౌడ్ వెల్లడించారు. సికింద్రాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, చిలకలగూడకు చెందిన సత్యనారాయణ అలియాస్ కటికె సత్తి ఆదివారం సాయంత్రం డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. చిలకలగూడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలకు ఆకర్శితులై వివిధ పార్టీల నుంచి పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్‌లోకి చేరుతున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా మైనార్టీ నాయకులు, చోటే మసీద్ కమిటీ నేత కరీం, డైమండ్ శ్రీను, సాయి కిశోర్ తదితరులు బీఆర్ఎస్‌లో చేరారు.

## మహిళలను ప్రోత్సహిస్తున్న ఏకైక పార్టీ బీఆర్ఎస్

### రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి, నవంబర్ 5: మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తున్న ఏకైక పార్టీ బీఆర్ఎస్ ఒక్కటేనని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షురాలు వజ్రమ్మ ఆధ్వర్యంలో పలువురు మహిళలు ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడా లేని విధంగా మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తున్నారని అన్నారు. వారికి కావాల్సిన సదుపాయాలను కల్పించడంతో పాటు అన్ని రకాలుగా ఆదుకుంటున్నారన్నారు. ఎన్నికల సమయంలోనే కనిపించే కాంగ్రెస్, బీజేపీ నేతలకు ఈ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. అన్ని వర్గాల ప్రజలు బీఆర్ఎస్ వెంటే ఉన్నారని, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు డిపాజిట్లు కూడా దక్కవని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కాశిగారి యాదగిరి, ఎంజాల మహేశ్ రాజ్, సీతారాం, మైపాల్, రాధాకృష్ణ, కొంకతి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు వజ్రమ్మ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరిన మహిళా నేతలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్

### బీఆర్ఎస్‌లో చేరిన ఇందిరాగాంధీ సొసైటీ సభ్యులు..

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి బీఆర్ఎస్ పార్టీలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు చేరుతున్నారని ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ అన్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఉత్తమ్ కుమార్ ఆధ్వర్యంలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ మధుబన్ కాలనీ ఇందిరాగాంధీ సొసైటీలోని నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కాశీగారి యాదగిరి, యంజాల మహేశ్ రాజ్, సీతారాం, మైపాల్, దంతరాజు, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




ఎమ్మెల్యే ముఠా గోపాల్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన మహిళా నేతలు

## అభివృద్ధిని చూసి ఓటేయండి

### బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ మహిళా నేతలు

ముషీరాబాద్, నవంబర్ 5: ముషీరాబాద్ నియోజకవర్గంలో లక్ష మందికి పైగా లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు, ఆసరా పింఛన్లు అందిస్తున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్ అన్నారు. అభివృద్ధిని చూసి ఓటెయ్యాలని కోరారు. ఆదివారం ముషీరాబాద్ డివిజన్ ప్రేయర్ పవర్ చర్చి వద్ద నిర్వహించిన ఎన్నికల సభలో కాంగ్రెస్‌కు చెందిన పలువురు మహిళా నేతలు ఎమ్మెల్యే ముఠా గోపాల్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారందరికీ ముఠా గోపాల్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిత్యం జనం మధ్య ఉండి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేసే తనను ఈ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముఠా జయసింహ, నర్సింగ్ ప్రసాద్, శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## కార్వాన్ బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు



మహిళా నేతలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీఆర్ఎస్ పార్టీ కార్వాన్ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి మిత్రకృష్ణ

జియాగూడ, నవంబర్ 5 : సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి కృషి చేస్తున్నారని, ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని కార్వాన్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మిత్రకృష్ణ కోరారు. అదివారం జియాగూడ ఎస్‌డీఏ గార్డెన్‌లో బీఆర్ఎస్ పార్టీ బూత్ స్థాయి కమిటీ నాయకులు, వడ్డెర సంఘం నాయకులు, ఇతర సంఘాల నాయకులు బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరిన యువకులు, మహిళా నేతలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం జియాగూడ అధ్యక్షుడు మంతటి నర్సింహ, బీఆర్ఎస్ యూత్ నాయకులు అభిషేక్ మిత్ర, జడల మోహన్, అసెంబ్లీ యూత్ నాయకులు మంగి కిశోర్‌కుమార్, నరహరి చారి, సి.బాబు, నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు జి.నర్మద, సంగీత, అమృత, అరుణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి కేటీఆర్ సమక్షంలో చేరిన మాజీ కార్పొరేటర్ శ్రీదేవి

నేరేడ్‌మెట్, నవంబర్ 5: ప్రగతి భవన్‌లోని మంత్రి కేటీఆర్ కార్యాలయంలో ఆదివారం నేరేడ్‌మెట్ డివిజన్‌కు చెందిన మాజీ కార్పొరేటర్ కటికనేని శ్రీదేవి హన్మంతరావు, నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో బీఆర్ఎస్‌లో చేరారు. మంత్రి కేటీఆర్, మల్కాజిగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్, మాజీ కార్పొరేటర్ కలిసి కె.శ్రీదేవి హన్మంతరావుకు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బీజేపీ నాయకులు జీకే హన్మంతరావు, మధుసూదన్ రెడ్డి, రాంరెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నాయకత్వంలోనే సుపరిపాలన సాధ్యమని, కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారిలో ఉపేందర్ రెడ్డి, సుదర్శన్ రావు తదితరులు ఉన్నారు.